www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025



ఫ్యాప్టో ఛైర్మన్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, వెంకట్రావ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఫ్యాప్టో నూతన ఛైర్మన్‌గా ఎస్.సురేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రావ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ భవనంలో శుక్రవారం ఫ్యాప్టో ఎన్నిక జరిగింది. కో-ఛైర్మన్‌గా కే.వెంకటరమణ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి.రామచంద్రయ్య, కే జగన్నాథం, బి మురళీకష్ణ, సెక్రటరీలుగా పి. విశ్వనాథ్, కే.మల్లికార్జున, బి.బాలసుబ్రమణ్యం, ట్రెజరర్‌గా లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి అబ్జర్వర్‌గా బిటిఏ రాష్ట్ర నాయకులు సిహెచ్. రమేష్ హాజరయ్యారు.

స్వీపిం(కిం)గ్...వెట్టి..!

- శ్రమదోపిడీతో 'స్వచ్ఛ' అవార్డు
- జీతాలివ్వకుండా ఇబ్బందులు
- పట్టించుకోని రైల్వే అధికారులు
- ఆధ్యాత్మిక తిరుపతిలో ఆకలికేకలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిరసన

ఆధ్యాత్మిక క్షేత్రంలో స్వీపింగ్ కార్మికుల 'ఆకలి కేకలు' రైళ్ల శబ్దంలో కలిసిపోతున్నాయి.. తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆరు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. రోజుకు 70 పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ స్టేషన్ గత ఏడాది 'స్వచ్ఛ' అవార్డును అందుకుంది. నిత్యం ప్లాట్‌ఫారాలను శుభ్రంగా ఉంచే స్వీపింగ్ కార్మికులకు మాత్రం జీతాలివ్వకుండా 'కింగ్' కాంట్రాక్టర్ పస్తులతో ఉంచుతున్నారు. ఆకలి భరించలేని కార్మికులు శుక్రవారం మెరుపు ధర్నాకు దిగారు. వీరి ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం, నాయకులు జయచంద్ర, మునిరాజా సంఘీభావం ప్రకటించారు.

కింగ్ కంపెనీ ముంబాయిలో ఉంటుంది. మూడేళ్ల క్రితం తిరుపతి రైల్వేస్టేషన్ స్వీపింగ్ టెండర్‌ను ఆ సంస్థ దక్కించుకుంది. తిరుపతి రైల్వేస్టేషన్‌లో వంద మంది మహిళా కార్మికులు స్వీపింగ్ పనులు చేస్తూ ఉంటారు. రోజుకు మూడు షిఫ్టులుగా వీరి పని ఉంటుంది. కింగ్ కంపెనీ నెలకు 12వేల జీతం ఇస్తామని ఈ కార్మికులను పనుల్లోకి తీసుకున్నారు. మరికొందరు నెలకు పదివేల జీతానికే కుదిరారు. ఇంకొందరు ఎనిమిదివేలే తీసుకుంటారు. అయితే ఇచ్చే అరకొర వేతనం వారికి నెలనెలా సక్రమంగా ఇవ్వని పరిస్థితి. ప్రతినెలా సగం జీతం వేయడం, అడిగితే వచ్చే నెలలో వేస్తానని చెప్పడం రివాజుగా మారింది.కాంట్రాక్టర్ చేస్తున్న మోసాన్ని అర్థం చేసుకోడానికి మహిళా కాంట్రాక్టర్లకు మూడేళ్లు పట్టింది. జీతం గురించి నిలదీస్తే వారిని పనిలో నుంచి తొలగించడం, చేసిన పనికి జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం చేస్తున్నాడు. 12వేలు జీతం ఇచ్చే కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ పేరుతో 2,800 కట్ చేసి 9,500 చేతిలో పెడుతున్నారు. ఈ పిఎఫ్ వారి అకౌంట్లలో జమ చేస్తున్నారో లేదో తెలియదు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆరు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. ఒక్కో ప్లాట్‌ఫారం ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది. వీటిలో చెత్తాచెదారాన్ని తొలగించాలి. ప్రయాణికుల మలమూత్రాలనూ శుభ్రం చేయాలి. రైల్వేజిఎంలు, డిఆర్ఎం, రైల్వే మంత్రుల ప్రారంభోత్సవాల సందర్భంగా వీరి కష్టం రెట్టింపు ఉంటుంది. ఒక్కోసారి ప్లాట్‌ఫారాలు శుభ్రం చేసేటపుడు ప్రమాదాలూ జరుగుతూ ఉంటాయి. ఆదివారాలు, పండగ సెలవులు వర్తించవు. సెలవు తీసుకోవాలంటే 15 రోజుల ముందు కాంట్రాక్టర్‌కు చెప్పి తీసుకోవాలి. సెలవు తీసుకుంటే ఆరోజు జీతం కట్. తిరుపతి రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే తమకు సంబంధం లేదని, కాంట్రాక్టర్‌నే అడగండి అని నిర్లక్ష్యంగా సమాధానమిస్తుండటం గమనార్హం. గతంలోనూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేసిన సందర్భంగా కొంతవరకు వారికి న్యాయం జరిగింది.

నెలనెలా పూర్తి వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్లాట్‌ఫాం శుభ్రం చేసే కార్మికులు మెరుపు ధర్నాను అర్థం చేసుకోవాలి. ఆకలి కేకలతో ఎంతోకాలం వారు పనులు చేయలేరు. కాంట్రాక్టర్ ఒప్పుకున్న పూర్తి వేతనాన్ని నెలనెలా ఒకటో తేదీనే ఇవ్వాలి. రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మునిరాజా, సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర సంఘీభావం ప్రకటించారు. రైల్వే అధికారులు జోక్యం చేసుకుని స్వీపింగ్ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వాలని, కాంట్రాక్టర్ దోపిడీపై చర్యలు తీసుకుని కనీస వేతనం ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్మికుల అకౌంట్లలో పిఎఫ్, ఇఎస్ఐ జమ అవుతుందో లేదో చూడాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలివ్వకపోతే పండగ రోజూ వారు పస్తులతో ఉండాల్సిందేనన్నారు. రైల్వే కాంట్రాక్టు కార్మికులు చంద్రముని, మహేశ్వరి ,పద్మ, సుధా, కల్పన, అరుణ పాల్గొన్నారు.

రేణిగుంటలో...

విద్యుత్ ఛార్జీల బాదుడులో...

వైసిపి, కూటమి 'సేమ్ టు సేమ్'

ప్రజాశక్తి - రేణిగుంట, వెంకటగిరి

'జగన్ సర్కారు పోయి, చంద్రబాబు ప్రభుత్వం వచ్చినా విద్యుత్ బిల్లుల షాకులు తప్పడం లేదు' అని సిపిఎం, సిపిఐ నేతలు ధ్వజమెత్తారు. రాష్ట్ర పిలుపులో భాగంగా రేణిగుంట కరెంట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, బిల్లులను దహనం చేశారు. విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సిపిఐ నాయకులు తులసిరాజన్ మాట్లాడుతూ గతంలో వైసిపి హయాంలో ప్రజలపైన బాదుడే బాదుడని ఫ్లెక్సీలు పట్టుకుని టిడిపి ప్రచారం చేసిందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తామని, బిల్లుల భారం తగ్గిస్తామని, ఛార్జీలను పెంచబోమని నమ్మబలికిందన్నారు. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే 15,450 కోట్ల రూపాయల భారాలను ప్రజలపై భారం మోపిందన్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్లు ఉపసంహరించుకోవాలని, అదానీతో కుదుర్చుకున్న సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. 2000లో కరెంట్ ఛార్జీలు పెంచిన సందర్భంగా హైదరాబాద్ బషీరాబాగ్ వద్ద ఉద్యమించిన వారిపై పోలీసులు కాల్పులు జరపగా కమ్యూనిస్టులు ముగ్గురు చనిపోయారని, ఆ తరువాత తొమ్మిదేళ్ల టిడిపి అధికారంలోకి రాకుండా చంద్రబాబును దూరం పెట్టిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సీనియర్ నాయకులు వెంకటరమణ, దిలీప్ బాషా, రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ పాల్గొన్నారు. సత్యవేడులో మండల కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. విద్యుత్ శాఖ ఎఇకి వినతిపత్రం సమర్పించారు.

వెంకటగిరిలో.. పాలకేంద్రం సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి అని ఇచ్చిన పిలుపును మరచిపోయారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో మరో విద్యుత్ పోరాటాన్ని చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం వి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజయ్య, దొరబాబు, నారాయణ పాల్గొన్నారు.

తిరుపతిలో..

అర్హులందరికీ రెండు సెంట్లు ఇవ్వాలి

సిపిఎం ప్రజా చైతన్య యాత్రల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు ఇళ్లస్థలం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో సిపిఎం ఆధ్వర్యంలో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా జరిగింది. మార్చి 7-17 తేదీల్లో సిపిఎం ప్రజాచైతన్య యాత్ర చేపట్టి, 22-28 తేదీల్లో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇళ్లస్థలాలు ఇవ్వాలని, ఆస్తిపన్నుపై వందశాతం వడ్డీ రాయితీ ఇవ్వాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటిపన్ను విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ సిరిపురం యానాది కాలనీలో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారికి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తెలుగుగంగ పైప్‌లైన్ వేసి తాగునీటి కొరత తీర్చాలన్నారు. శెట్టిపల్లి ఇళ్లస్థలాలు కొనుగోలు చేసిన అందరికీ ప్రభుత్వం ప్రకటించినట్లు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని చెప్పారని, ప్రతి ఒక్కరికీ రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూగర్భడ్రైనేజీ సమస్య తిరుపతిలో తీవ్రంగా ఉందన్నారు. అనంతరం కమిషనర్ ఎన్.మౌర్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ మాధవ్, ఆర్ లక్ష్మీ, పి బుజ్జి, పి చిన్న, ఆర్ మల్లికార్జునరావు, పి రమేష్, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ విద్యుత్ కార్మికుల రిలే నిరాహార దీక్షలో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు శిబిరం వద్ద పుత్తూరు డివిజన్ అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ గత ఐదు రోజులుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యలపై తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం ముందు ఎర్రటి ఎండలో నిరాహార దీక్షలు చేస్తున్నా, యాజమాన్యం ఏమీ పట్టనట్టు అదే దారిలో చూస్తూ వెళుతూ అన్యాయమైన రీతిలో వ్యవహరిస్తోందన్నారు. ఈ దీక్షలో తిరుపతి జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్ రెడ్డి, కుమార్, రవి, ప్రసాద్, నూర్ భాషా, బాబు, ధర్మ భార్గవ్, ప్రతాప్ పాల్గొన్నారు.

మహిళలు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి: సిఐ

తిరుపతి టౌన్ : నవ భారత్ సేవా సమాజం సంస్థ తిరుపతిలోని అంబేద్కర్ కాలనీలో మహిళలకు ఉచిత శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.తమీమ్ అహ్మద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. నైపుణ్య శిక్షణ కేంద్రాలు మహిళలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావడానికి సహాయపడతాయని అన్నారు. మహిళలపై దాడులను నియంత్రించడానికి సమాజంలో బలంగా, ధైర్యంగా ఉండాలని, ముఖ్యంగా మహిళలు భారతీయ శిక్షాస్మృతిలోని చట్టపరమైన అంశాలను తెలుసుకోవాలని, ఆత్మరక్షణ అవసరమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నవ భారత్ సేవా సమాజ్ సంస్థ అధ్యక్షుడు కె.ఆర్.వెంకటాచలం, బాలాజీ , జనరల్ సెక్రటరీ రహమతుల్లా పాల్గొన్నారు.

వ్యవసాయ అంకుర సంస్థలకు నిధులు విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొత్త ఆవిష్కరణలకు మద్దతుగా వ్యవసాయ అంకుర సంస్థలకు గ్రాంట్ పంపిణీ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 2వ, 3వ, 4వ బ్యాచ్‌లకు తుది విడత మంజూరులు, 6వ బ్యాచ్‌కి తొలి విడతగా రూ.5 లక్షల (ప్రీ-సీడ్ కేటగిరీ) గ్రాంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 20 స్టార్టప్‌లకు గ్రాంట్‌లను అందజేశారు. ఏఎన్ జి ఆర్ ఏయు ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మి దేవి వర్చువల్ గా హాజరయ్యారు. డాక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ ఇంక్యుబేటర్ మద్దతుతో అభివద్ధి చెందుతున్న స్టార్టప్‌లు భవిష్యత్‌లో వ్యవసాయ రంగానికి కీలకమైన మార్పులను తీసుకురావడానికి తోడ్పడతాయన్నారు. డాక్టర్ వి. సుమతి, డాక్టర్ కదిరి మోహన్ పాల్గొన్నారు.

బయలాజికల్ సైన్స్ పరీక్షకు 26,793 మంది హాజరు

ప్రజాశక్తి - తిరుపతి

పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన బయాలజీ సైన్స్ పరీక్షకు 26,793 మంది హాజరయ్యారు. తిరుపతి జిల్లాలో 164 పరీక్ష కేంద్రాల్లో , 10ఫ్లయింగ్, 31 సిట్టింగ్ స్క్వాడ్ల పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షకు మొత్తం 27,141 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారిలో 26,793 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 348 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, పర్యవేక్షించినట్లు తెలిపారు.

ఈ భూమి పిఓబి జాబితాలో ఉంది : జేసీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం

'మాది అంటున్న ఈ భూమి మీకు హక్కు కల్పించే అవకాశం లేకుండా పి ఓ బి జాబితాలో ఉంది.. దీనిపై పరిశీలిస్తా.. అవకాశం ఉంటే న్యాయం చేస్తా' అని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ రైతులకు సూచించారు. శుక్రవారం జెసి,ఆర్డీవో కిరణ్మయి,తాసిల్దార్ శైలకుమారి లతో దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి సర్వే నెంబర్ 7లో పిఓబి భూమిని పరిశీలించారు. ఆ భూమి తమదని, గత 40 ఏళ్లుగా ఉంటున్నామని, నేటికీ తమ స్వాధీనంలో ఉందని, తమకు న్యాయం చేయాలని దళితులు జేసీకి మొరపెట్టుకున్నారు. వీఆర్వో ఈ భూమి పూర్వ చరిత్రను వివరించారు. గతంలో వీరికి వేరే సర్వే నంబర్ లో 2 ఎకరాల పైబడి భూమి పట్టా ఇచ్చినట్లు వివరించారు. సర్వేనెంబర్ 7 భూమికి సంబంధించిన రికార్డును పరిశీలించి, గూగుల్ మ్యాప్ ద్వారా ఈ భూమి వివరాలు తెలుసుకున్నారు. ఆర్ ఐ మోదుగుల ప్రవీణ్ రాయల్, వీఆర్వో రమేష్, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మరణం అనుమానాస్పదమే..

ప్రజాశక్తి - రేణిగుంట

పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం అనుమానాస్పదమే అని, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూడాలని పరిశుద్ధ లూకా లూథరన్ సంఘపు పాస్టర్ రెవ. కె.పి. లూథర్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పరిశుద్ధ లూకా లూథరన్ సంఘపు వారు శుక్రవారం పాస్టర్. ప్రవీణ్ పగడాల మరణమును దుఃఖిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కె. పి. లూథర్ బాబు మాట్లాడుతూ పాస్టర్. ప్రవీణ్ పగడాల మరణమును రోడ్డుప్రమాదంలా అనిపించలేదని, ఎవరో కుట్రపన్ని హత్య చేశారన్న అనుమానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశుద్ధ లూకా లూథరన్ సంఘపు పి.సి.సి. అధ్యక్షుడు కె. యేసురత్నం, వైస్ ప్రెసిడెంట్ కె.పి. సతీష్ జయకర్ , సెక్రటరి నిర్మల చార్లస్, కోశాధికారి కె. పుష్పాంజలి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఈఈ

ప్రజాశక్తి -తిరుపతి సిటి

తిరుపతి కొర్లగుంట సెక్షన్‌లో 33/11 కె.వి. శ్రీనివాసం విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్లను తొలగించుటకు 29వ తేది శనివారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ విన్నకోటి చంద్రశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. చింతల చేను ,డి.బి.ఆర్ రోడ్ ,సంజయ్ గాంధీ కాలనీ , గ్రూప్ ఏరియా , విష్ణు నివాసం పిఎల్ ఆర్ గ్రాండ్, పి ఎల్ ఆర్ కేన్స్ , బండ్ల వీధి , చిన్నకాపు స్ట్రీట్, రైల్వేస్ స్టేషన్ తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులందరు విద్యుత్ సరఫరా అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్మార్ట్‌సిటీ పెండింగ్ పనులు త్వరగా పూర్తవ్వాలి

తిరుపతి టౌన్ : స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న పనుల్లో పెండింగ్ ఉన్న వాటిని సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్,కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం స్మార్ట్ సిటీ ఎం.డి,, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన స్మార్ట్ సిటీ 38 వ బోర్డు మీటింగ్ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. స్మార్ట్ సిటీ లో జరుగుతున్న అభివద్ధి పనులను మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో బోర్డు డైరెక్టర్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఇంజనీరింగ్ చీఫ్, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డా.రామచంద్ర రెడ్డి, డా. రమాశ్రీ , డిల్లీ నుండి రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, ఈ.ఈ రవి, ఏఇకామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు..

1న సామాజిక పింఛన్లు రూ.111.82 పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు ఏప్రిల్ 1వ తారీఖున పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్.ఎస్ ఆదేశించారు. శుక్రవారం పి.డి, డిఆర్డిఏ- వెలుగు, లీడ్ బ్యాంకు మేనేజరు, ఎంపీడీవో లు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ తదితరులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మంగళవారం పంపిణీ చేయవలసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ మొత్తాన్ని ఈ నెల మార్చి29 శనివారం నాడే సంబంధిత అధికారులు డ్రా చేసి సేఫ్ కస్టడీ లో ఉంచుకొని, ఏప్రిల్ 1 వ తారీఖున సిబ్బంది అందరూ ఉదయం 6.30 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేయుట కొరకు వారి పంపిణి ప్రదేశాలకి చేరుకొని ఉదయం 6.45 గంటలకు యాప్ ఓపెన్ అయ్యాక పింఛను దారులకు పింఛన్లు పంపిణి చేపట్టాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్, ఆడిటింగ్‌పై శ్రీసిటీలో అవగాహన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర పరోక్ష పన్నుల, సుంకాల మండలి (సి.బి.ఐ.సి.), భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ), శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు, ఆడిటింగ్ పై అవగాహన సమావేశం శ్రీసిటీలో శుక్రవారం జరిగింది. పి. ఆనంద్ కుమార్, ఐఆర్ఎస్, కమిషనర్, గుంటూరు ఆడిట్ కమిషనరేట్, కేంద్రపు పన్నులు, కేంద్ర ఎక్సైజ్ కస్టమ్స్, విశాఖపట్నం జోన్ నేతత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, అనుగుణ్యత మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.ఆనంద్ కుమార్‌ను శ్రీసిటీ కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. 'ఒక దేశం, ఒక పన్ను' విధానం వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 70 లక్షల నుంచి 140 లక్షలకు పెరిగిందని, మధ్యస్థ పన్ను రేటు 14.5 నుండి 11.5 శాతం తగ్గిందని, దీని ఫలితంగా ఆర్థిక వద్ధి వేగంగా కొనసాగుతోందని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఎ.మాలతి పాల్గొన్నారు.

శ్రీవారి, ముక్కంటి సేవలో హీరో నితిన్

ప్రజాశక్తి -తిరుమల, శ్రీకాళహస్తి

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ తిరుమల స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి ఆయన శ్రీవారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో నితిన్‌కు వేద పండితులు ఆశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈరోజు నితిన్ నటించిన కొత్త సినిమా 'రాబిన్‌హుడ్' థియేటర్లలోకి వచ్చిన విషయం తెలిసిందే. వెంకీ కుడుముల దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. నితిన్ సరసన కథానాయికగా యంగ్ బ్యూటీ శ్రీలీల నటించగా... ఆసీస్ మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో నటించడం విశేషం. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అన్నమయ్య కీర్తనలతో సామాజిక చైతన్యం

ప్రజాశక్తి - తిరుమల

సమాజంలో విలువలను పునరుద్ధరించి, సామాజిక, ఆధ్యాత్మిక చైతన్యం పెంచేందుకు అన్నమయ్య కీర్తనలు ఎంతగానో దోహదపడతాయని ఎస్వీ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సర్వోత్తమరావు పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న సాహితీ సదస్సులు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆచార్య సర్వోత్తమరావు "అన్నమయ్య సంకీర్తనలు - సామాజిక దష్టి" అనే అంశంపై ఉపన్యసించారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో అన్ని వత్తుల వారు సమానమేనని, రాజు - పేద తేడాలు ఉండకూడదని, అందరికీ శ్రీహరే అంతరాత్మ అని అన్నమయ్య తెలియజేశారని చెప్పారు. ఆశ్రమ ధర్మాల్లో గహస్తాశ్రమ గొప్పదనాన్ని సంకీర్తన ద్వారా తెలియజేశారన్నారు. పలు సంకీర్తనల్లో రాయలసీమ మాండలికానికి పెద్దపీట వేశారని చెప్పారు. అన్నమయ్య కీర్తనలను చదివినా, విన్నా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు అధ్యాపకులుకష్ణవేణి "అన్నమయ్య సంకీర్తనలు - పురాణ గాథలు " అనే అంశంపై ఉపన్యాసించారు. జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ నల్లన్న "పోతన - అన్నమయ్య " అనే అంశంపై ఉపన్యసిస్తూ పరమ భాగవతోత్తముడైన పోతన పద్య రచన ద్వారా శ్రీ మహావిష్ణువును కీర్తించగా, హరి కీర్తనాచార్యుడైన అన్నమయ్య పద సాహిత్యంద్వారా ఆ దేవదేవుని కీర్తించారని అన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఇంఛార్జి సంచాలకులు కె.రాజగోపాల రావు పాల్గొన్నారు.

కోరినప్పుడే.. రిజిస్ట్రేషన్..!

ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దస్తావేజుల రిజిస్ట్రేషన్ల కోసం స్థిరాస్తి క్రయ, విక్రయదారులు ఇకపై గంటల తరబడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద నిరీక్షించాల్సిన పని లేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలోనూ త్వరలో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. కక్షిదారులు ఆన్ లైన్ ద్వారా ముందుగానే స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించ నుంది. తొలుత ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 1 నుంచి ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

శుభముహూర్తాలు చూసుకుని ఎక్కువమంది రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ప్రస్తుతం కొనుగోలు, విక్రయదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్లాట్ బుకింగ్ విధానంపై జిల్లా ల్లోని సిబ్బందికి షెడ్యూల్ వారీగా తాడేపల్లిలోని సంబంధిత శాఖ ఐజీ కార్యాలయంలో శిక్షణ ఇవ్వను న్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23న జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలోని రిజిస్ట్రే షన్ కార్యాలయం నుంచి సిబ్బంది అక్కడ శిక్షణ పొందారు. ప్రయోగాత్మకంగా స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ ఇక్కడ మొదలైన తర్వాత దశలవారీగా జిల్లాలోని మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లోనూ అమలు కానున్నట్లు అధికా రులు చెబుతున్నారు

గంటకు ఆరుగురికి అవకాశం

తిరుపతి జిల్లా పరిధిలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో రోజూ 250 నుంచి 300 వరకు దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. వీటిలో అత్యధిక డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జిల్లా కేంద్రమైన తిరుపతి కార్యాలయంలోనే జరుగుతున్నాయి. ఇక్కడ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ల విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. కక్షిదారులు ముందుగానే వారికి అనుకూల మైన సమయాన్ని సంబంధిత వెబ్సైట్లో ఎంపిక చేసుకోవచ్చు. పబ్లిక్ డేటాఎంట్రీలో స్లాట్ బుకింగ్ ఆప్షన్ ద్వారా ఇంటి వద్ద నుంచే తమకు కావాల్సిన తేదీని ఎంపిక చేసుకుని ఆ సమయానికి కార్యాలయానికి వస్తే సరిపోతుంది. ఈ విధానంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్పాట్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. గంటకు ఆరుగురికి చొప్పున స్లాట్ బుకింగ్ అవకా శాన్ని కల్పించనున్నారు.

సమయం ఆదా

శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్

స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానం అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని, ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారికి సౌకర్యవంతంగా ఉండటం తోపాటు సమయం ఆదా అవుతుందని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్ కుమార్ చెబుతున్నారు. దీనికి సంబంధించి పూర్తి విధివిధానాలు రావాల్సి ఉందన్నారు.

జడ్పీటిసి భవనం ప్రారంభం

భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన జడ్పీటిసి భవనాన్ని, శనివారం నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట జడ్పీటిసి సభ్యులు మురళి రెడ్డి, ఎంపీడీవో శశిధర్ రావు, వడమాల పేట సర్పంచ్ మునెమ్మ , టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జాన వెంకటయ్య, శ్రీధర్ రాజు, అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.కె.ఆర్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎస్ కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో శ్రీ సిటిలోని కొల్గేట్ పామోలివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బ్లూ స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొన్నాయి. 50 మందికి ఇంటర్వ్యూలకు హాజరవగా కోల్గేట్ కంపెనీకి 12 మంది, బ్లూ స్టార్ కంపెనీకి 14 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కలశాల జె.ఏ.సి కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఏపీ ఎస్.ఎస్.డి.సి కో ఆర్డినేటర్ లక్ష్మి, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు:పీలేరు డిపో పరిదిలో ఈరోజు ఉదయం 11 నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పీలేరు డిపో మేనేజర్ తెలిపారు. కావున ప్రయాణికులు డిపో పరిధిలో ఏమైనా సమస్యలు ఉన్నా, సూచనలు, సలహాలు ఉన్నా ఫోన్ నెం.9959225679లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

ప్రజాశక్తి- నాగలాపురం: కోట్ల విలువచేసే చెరువు పోరంబోకు సంబంధించిన ప్రభుత్వ భూమిని ఓ టిడిపి నాయకుడు కబ్జా చేయడం జరిగింది. రెవెన్యూ అధికారులకు తెలిసినా, వారు పట్టించుకోవడం లూదపి స్థానికులు ఆరోపిస్తున్నారు. నాగలాపురం మండలం, సురుటుపల్లి పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 8 /21 ఏ చెరువు పోరంబోకు సంబంధించిన ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమిని సత్యవేడు, దాసుకుప్పం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ఒకరు కబ్జా చేసుకుని ఫెన్సింగ్ వేశాడు. ఆ నాయకుడు ఇంకా కొంత భూమిని కూడా ఆక్రమించుకుని తమిళనాడు వాసులకు కొంత భూమిని అమ్మడం కూడా జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ భూమిని గత ప్రభుత్వంలో చెరువు పోరంబోకు ప్రభుత్వ భూమిగా జిల్లా అధికారులు కూడా గుర్తించారు. దీనిపై తహశీల్దారు హనుమాన్ నాయక్ వివరణ కోరగా సురుటుపల్లిలో కబ్జాకు గురైన స్థలాన్ని సర్వేయర్, విఆర్ఓలతో కలిసి సర్వే చేసి, ప్రభుత్వ భూమి అని తేలితే ఫెన్సింగ్ తొలగిస్తామని చెప్పారు.

బిఎస్ఎన్ఎల్ మెగా సిమ్ మేళా

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని చెక్ పోస్ట్ ఆవరణలో శుక్రవారం ఉదయం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సిబ్బంది ఆధ్వర్యంలో పాత 3జి, 2జి బిఎస్ఎన్ఎల్ సిమ్‌లను 4జి, 5జి సిమ్‌లుగా మార్చుటకు మెగా సిమ్ మేళ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది రాఘవులు వినియోగదారులు ఈ అకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈద్గా యూత్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు పట్టణంలోని దర్గా వీధికి చెందిన ఈద్గా యూత్ అసోసియేషన్ కార్యాలయంలో 300 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను ఈద్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షబ్బీర్, కార్యదర్శి యస్దాని, మగ్దూమ్ మొహిద్దీన్, షఫీ మౌలానా, నూర్ స్వచ్ఛంద సేవ సంస్థ అబ్రారుల్ హక్,ఇనాముల్ హక్,సభ్యులు మున్నా, ఖాదరు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం పట్టు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని, కనమనంబేడు గ్రామ దళితులు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం తమ స్వాధీనంలో ఉన్న ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని రిలే నిరాహార దీక్ష ఏడోరోజు కొనసాగించారు. తహశీల్దార్ చాంబర్ ముందు కూర్చొని నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్ మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూలోని 252, 253, 254 సర్వే నెంబర్లలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలకోసం స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య వారి బృందం, సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, గుర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చెందోడులో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -కోట : కోట మండలం చెందోడు పంచాయతీ పరిధిలో ఉన్న హెల్త్ సెంటర్‌లో శుక్రవారం తిరుపతి, సిమ్స్ ఆస్పత్రి వైద్యులు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలు టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా తిరుపతి సిమ్స్ ఆస్పత్రి మొబైల్ టీమ్‌కు చెందిన డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువగా నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లు వస్తున్నాయన్నారు. ముందుగా గుర్తించి వైద్యం తీసుకుంటే ప్రమాదం తప్పుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సిమ్స్ ఆసుపత్రి డాక్టర్ పద్మావతి, మొబైల్ టీమ్, స్థానిక చిట్టేడు ఆసుపత్రి డాక్టర్ నాగరాజు, టీడీపీ తిరుపతి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు బందిల రఘురామ్, మేకల శ్రీనివాసులు, ఎద్దల మురళీమోహన్ రెడ్డి, నీలంసురేందర్ రెడ్డి, మొగిలిగుంట వెంకటేశ్వర్లు, చల్లా వెంకటేశ్వర్లు, చల్లా పుట్టయ్య, చెందోడు హెల్త్ సెంటర్ సిబ్బంది, ఏఎన్ఎమ్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు కోమది తదితర సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కల నెరవేరేనా..?

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్: ప్రతి పేదవాడు కోరుకునేది ఒక్కటే. తన కుటుంబం తలదాచుకోవడానికి సొంతంగా ఒక గూడు ఉంటే, కూలో.. నాలో చేసుకుని, కలో... గంజో తాగి ప్రశాంతంగా బతకచ్చని అనుకుంటాడు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇస్తామని వాగ్దానాలు చేస్తారు. ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం చూపించి, ప్రభుత్వమే కొంత ధనాన్ని కూడా అందిస్తుంది. కానీ ఇంతవరకు బాగానే ఉంది. గత ప్రభుత్వంలో ఇదే తరహాలో మండలంలో సొంత ఇల్లు లేని అర్హులైన ప్రతి పేదవానికి సొంత గృహాలు నిర్మించడానికి నడుం కట్టింది. మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. వీటికి గాను గత ప్రభుత్వంలో 1757 మందికి సొంత గృహాలను నిర్మించడానికి ఇంటి స్థలాలను కేటాయించింది. పట్టణంలో నివసించే వారికి ఒక సెంటు భూమి, అదే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి ఒకటిన్నర సెంటు భూమి లెక్కన స్థలాన్ని అధికారులు కేటాయించారు.

ప్రభుత్వ ఆర్థిక సాయం..

ఈ గృహాలను నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుంచి 1,50,000 రూపాయలు, ఉపాధి హామీ పథకం కింద 30 వేల రూపాయలు అందించే విధంగా నిబంధనలు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం గత ప్రభుత్వం ప్రకటించిన దానికంటే అదనంగా ఎస్టీలకు 75 వేల రూపాయలు, ఎస్సీ, బీసీలకు 50 వేల రూపాయలు అదనంగా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు.

పునాదులతో ఆగిన నిర్మాణం..

ఇంతవరకు పూర్తయినవి..

1757 గృహాలకు గాను ఇంతవరకు పిల్లర్లు వేసినవి 19, బేస్మెంట్ లెవెల్ 167, ఏడు అడుగుల మట్టాల వరకు నిర్మించినవి 44, స్లాబ్ లెవెల్ వరకు నిర్మించినవి 211, స్లాబ్ పూర్తి అయినవి 126, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తి అయిన ఇళ్లు1061 గా అధికారులు చెబుతున్నారు. ఇంతవరకు ప్రారంభం కానీ ఇళ్లు కూడా ఉన్నాయి. ఊరందూరు నుంచి వెంకటగిరి మండలానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రాంతంలో సుమారు 345 మందికి ఒకే ప్రాంతంలో ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాల పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఇప్పటికే నిర్మించిన ఇళ్లకు ఏర్పర్చిన కిటికీలు, తలుపులు, విద్యుత్ స్తంభాలకు అమర్చిన విద్యుత్ దీపాలు, గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించి అర్హులైన ప్రతి పేదవాని సొంతింటి కలలను నెరవేరుస్తారని గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

> ఇల్లు నిర్మించుకునే వారికి, వారి ఇంటి నిర్మాణ దశను బట్టి బిల్లులు అందిస్తున్నాం. ఈ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకున్న వారు కాపురాలకు రాని కారణంగా ఇంటి నిర్మాణ సామగ్రి దొంగతనాలు జరుగుతున్నాయి. చోరీలు అరికట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. - సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి రూరల్‌హౌసింగ్ ఏ.ఈ

ఇంటి చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

కార్మికులకు 3 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి గ్రామీణ మండలంలో నూతనంగా ఏర్పడిన గాంధీపురం పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో 37 మంది కార్మికులకు వేతనాలు ఇస్తున్న పంచాయితీ, నేడు 33 మందికే ఇస్తోంది. పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ మధ్య ఉన్న అంతరం కార్మికుల పాలిట శాపంగా మారింది. ఈ ఏడాది ప్రారంభం నుండి కార్మికులకు జీతాలు వేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సిపిఎం రూరల్ పార్టీ సెక్రటరీ సుమన్, సిఐటియు నాయకులు జయచంద్ర, సిఐటియు కార్యదర్శి మునిరాజాల ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి గాంధీపురం సచివాలయం ముందు నిరసన దీక్షను చేశారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని, కార్మికుల ఖాతాలకు క్రమంగా పిఎఫ్, ఈఎస్ఐ నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపుతామని, కార్మికులకు సిఐటియూ నాయకులు భరోసా కల్పించారు.

గాంధీపురం సచివాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

పీఎఫ్ ఖాతాకు చేరని నగదు

పంచాయతీ ఖాతా నుండి సిఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు, కార్మికులకు ఏర్పాటుచేసిన పిఎఫ్ ఖాతా, ఈఎస్ఐలకు నగదు బదిలీ జరుగుతోంది. కానీ గడిచిన 14 నెలలుగా కార్మికుల ఖాతాకు పిఎఫ్, ఈఎస్ఐ నగదు 1775 రూపాయలు చేరలేదని కార్మికులు వాపోతున్నారు. మరి సి ఎఫ్ ఎం ఎస్ ఖాతా నుండి బదిలీ అయిన నగదు ఎవరి ఖాతాకి వెళ్తోంది అర్థం కాని పరిస్థితి.

ఈ సమస్యలపై పంచాయతీ సెక్రటరీ లతశ్రీని వివరణ కోరగా సర్పంచితో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. జనవరి నుండి కార్మికుల హాజరు రిజిస్టరు పరిశీలిస్తే 33 మంది మాత్రమే హాజరైనట్లుగా చూపుతున్నారని, దీన్నిబట్టే జీతాలు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నానని సెక్రటరీ బదులిచ్చారు. కానీ సర్పంచి పంచాయతీ కార్యాలయానికి రాకపోవడంతో ఈ సమస్య కొనసాగుతోందన్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి.. కార్మికుల సమస్యను ఉన్నతాధికారులు కలుగజేసుకొని పరిష్కరించాలి. లేకపోతే కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో తీవ్రమైన పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోంది.
- వి. రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సిఐటియు అనుబంధం.

కుటుంబం గడవని పరిస్థితి.. గాంధీపురం పంచాయతీ ఏర్పడ్డాక జీతాల సమస్య అనేది ఉత్పన్నమైంది. జీతాలు లేక ఏమి చేయాలో పాలు పోక ఉన్నతాధికారుల వైపు చూస్తున్నాం. మాకు రావలసిన పిఎఫ్, ఈఎస్ఐ నగదును కూడా చెల్లించాలి.
- ఏ. వెంగమ్మ, స్వీపర్, గాంధీపురం గ్రామపంచాయతీ, తిరుపతి గ్రామీణ మండలం.

ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట భద్రత

రేణిగుంట : జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా, భద్రత ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్ర పరచబడిన ఈవీఎం గోదామును శుక్రవారం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి, ఎస్డిసి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు దూరం... చదువుకు దగ్గర ..!

ప్రజాశక్తి - రేణిగుంట: విద్యార్థులు పరీక్షల సమయంలో సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి, చదువుకు దగ్గరగా ఉండాలని ఆషా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జూలియన్‌రాజు అన్నారు. రేణిగుంట మండలం జీవగ్రంలోని పిఎం హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం చేయూత సోషల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ సర్వీసు కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కెపి సుభాకర్, హైమావతి, ఆనంద్, ప్రసన్న పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ముత్యాలమ్మ జాతర

ప్రజాశక్తి -చిల్లకూరు: వైభవంగా మూడు రోజుల పాటు జరిగిన ముత్యాలమ్మ జాతర శుక్రవారంతో ముగిసింది. అమ్మవారికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ దంపతులు, పెంచలకోన దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ తానంకి నానాజీ దంపతులు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఎన్‌బికెఆర్‌లో మూజికల్ ఫెస్ట్ 2025

ప్రజాశక్తి-కోట: కోట మండలం, విద్యానగర్‌లోని ఎన్బికెఆర్ ఐఎస్‌టిలో శుక్రవారం సాయంత్రం మ్యూజికల్ పెస్ట్ 2025 కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ నేదరు మల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ, వారి బృందంతో కలిసి జానపద గీతాలతో కూడిన సంగీత విభరిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె పాడుతున్న పాటలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ కేరింతలతో ఆహ్లాదంగా గడిపారు. మ్యూజికల్ ఫెస్ట్ గురించి నేదరమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆహ్లాదం కలిగించే ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి,విభాగాధిపతులు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో హ్యాక్ ఫెస్ట్ 2కె - 2025

సమావేశంలో ప్రసంగిస్తున్న కళాశాల చైర్మన్ అశోక్ రాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :పుత్తూరు, సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో సిద్ధార్థ హ్యాక్ ఫెస్ట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి 14 కళాశాలల నుండి 420 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కళాశాల చైర్మన్ అశోక్ రాజు చేతులు మీదుగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 24 గంటల్లో కంప్యూటర్ సమస్యల పరిష్కారానికి మార్గం కనుగొనాలని విద్యార్థులకు తెలియజేశారు. జడ్జీలుగా చంద్రశేఖర్ ఆర్టిఫిషియల్ అండ్ డేటా ఇంజినీర్ బెంగళూరు, ఫకీరప్ప అండ్ కుమార్ టెక్ ఆఫ్ సంస్థ తిరుపతి, ప్రొఫెసర్స్ ఆర్జీ కుమార్, శ్రీధర్, ప్రియదర్శిని, బసవరాజులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి జనార్ధన్ రాజు , వైస్ ప్రిన్సిపాల్ గోపీనాథ్, సిఎస్సి హెచ్వోడీలు, మనీ వాసగం, మల్లిగా, హెచ్ ఓ డి లు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి 'సహకారం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైతుల సంపూర్ణ అభివృద్ధికి తంగేళ్లపాలెం ప్రాథమిక సహకార సంఘం అఫీసియల్ పర్సన్ ఇంచార్జి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిరుపతి పి.రవిబాబు సహకారం అందిస్తామని తెలిపారు. స్థానిక తంగేళ్లపాలెం పిఎసిఎస్‌లో శుక్రవారం మహాజనసభను నిర్వహించారు. 2025-26 బడ్జెట్ పై తీర్మానించారు. రూ. 85 లక్షల బడ్జెట్‌తో ముందుకెళ్తున్నట్లు రవిబాబు తెలిపారు. రామచంద్రపురం వద్ద ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, నిధులపై చర్చించి ఆమోదించారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను విరివిగా ఇచ్చేందుకు అంగీకరం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులతో రైతులకు అదనపు ఆదాయం : ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) పాడిపశువులతో రైతులకు అదనపు ఆదాయం సమకూరితుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి మండలం, నారావారిపల్లెలో క్లస్టర్ ఏరియాలో పాడి పశువులలో ఎద క్రమబద్ధీకరణ పథకము అమలు గురించి శుక్రవారం పాడి రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పులివర్తి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పశువులతో అధిక పాల ఉత్పత్తితో అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, ఎంపీడీవో వెంకటరత్నం నాయుడు, తహసిల్దార్ శివరాం సుబ్బయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

రైతులకు ఊతం.. వ్యవసాయ యాంత్రీకరణే

- ఆర్ సి పురానికి 50 యూనిట్ల వ్యవసాయ పనిముట్లు మంజూరు
- నేడు రైతులకు పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో వ్యవసాయ యంత్రాలను అందజేయనుంది. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. కూలీల కొరత, తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పనులు పూర్తి కావడం వంటి ప్రయోజనాలతో, ఈ మెషినరీ పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయితీతో వ్యవసాయ పనిముట్లను అందించేందుకు రూ. 7,50,000 విలువగల ట్రైన్ స్ప్రింగ్ మడకలు:10, ట్రైన్ చెక్క మడకలు:3, ట్రైన్ చెక్క మడకలు:1 గుంతక లెవెలింగ్ ఇనుప బ్లేడ్లు:4, పెట్రోల్ పవర్ స్ప్రేయర్లు:17, బ్యాటరీ స్ప్రేయర్లు:7, మరో ఏడు ఇనుపమడకలను మొత్తం 50 వ్యవసాయ యంత్రాలను మండలాన్ని కేటాయించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి రైతుల నుండి దరఖాస్తుల స్వీకరించి, వారి వాటా 50 శాతం, ప్రభుత్వ వాటా 50 శాతం కంపెనీ వారికి చెల్లించి యంత్రాలను మండల కేంద్రంలోకి చేర్పించారు. ఎమ్మెల్యే నాని చేతుల మీదుగా నేడ ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేయనున్నారు.

> గత ఐదేళ్లలో రాయితీ వ్యవసాయ పనిముట్లు ఇవ్వలేదు : మోహన్ రెడ్డి, రైతు, అనుపల్లి
>
> గత ప్రభుత్వ హయాంలో రైతులకు రాయితీ వ్యవసాయ యంత్రాలను ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల కోసం రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందించడం చాలా ఆనందంగా ఉంది. ఈ పనిముట్ల వల్ల వ్యవసాయ పంటలను మరింతగా పండించి లాభాలు పొందుతాం.

> రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం : ఏవో స్రవంతి
>
> రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో మంజూరు చేసిన వ్యవసాయ పరికరాలను గ్రామాలలోని రైతులకు తెలియజేసి నూరు శాతం గ్రౌండింగ్ చేసామని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించ డమే తమ లక్ష్యమన్నారు. వ్యవసాయ యంత్రాల గ్రౌండింగ్ చేయడంలో ఆర్ సి పురం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసిన వ్యవసాయ శాఖ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

క్రైం న్యూస్

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - సత్యవేడు: వాహనంతో ఢీ కొట్టి చంపడానికి ప్రయత్నించిన కేసులో తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కన్నవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తేరువాయి భాస్కర్(44)ను స్థానిక పోలీసులు గురువారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం సత్యవేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సీఐ మురళి నాయుడు కేసు వివరాలను వెల్లడించారు. సత్యవేడు పట్టణం ఉలవచేనుకు చెందిన పవన్ కబాడీ ఆడడానికి తరచూ నాగలాపురం మండలం, బీరకుప్పం గ్రామానికి వెళ్తున్న నేపథ్యంలో కన్నవరం హరిజనవాడకు చెందిన సంధ్య కుమార్తె సుమిత్రతో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఇదే సందర్భంలో కన్నవరం హరిజనవాడకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, సుమిత్ర తల్లి సంధ్యతో మూడేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడు. సంధ్య తన కూతురిని ప్రేమిస్తున్న పవన్‌ను హెచ్చరించాలని భాస్కర్‌ను కోరింది. దీంతో కన్నవరం వస్తే చంపేస్తానంటూ భాస్కర్ పవన్‌ను బెదిరించాడు. అయితే ఈ విషయం తెలుసుకున సుమిత్ర భాస్కర్‌కు తన ప్రేమ విషయంలో సంబంధం లేదని అతనికి తగిన బుద్ధి చెప్పాలని పవన్‌ను రెచ్చగొట్టింది. పవన్ తన మిత్రులు భరత్, సారధి, ఉదయ్‌లతో కలిసి భాస్కర్‌పై దాడి చేసి కొట్టారు. దెబ్బలు తిన్న భాస్కర్ కక్ష పెంచుకుని మార్చి 24వ తేది సాయంత్రం వాహనంపై వెళుతూ, రోడ్డుపై వెళుతున్న ఆ నలుగురిని ఢీకొట్టి పరారయ్యాడు. బాధితుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భాస్కన్‌ను అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు సీఐ మురళి తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రమాదంలో మృతి చెందిన తొప్పాని అంకయ్య

ప్రజాశక్తి - నాయుడుపేట: కాలినడకన వెళ్తున్న వ్యక్తిని, బొగ్గులోడుతో వెళ్తున్న లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన నాయుడుపేట మునిసిపాలిటీ పరిధి, గోమతి సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో జరిగింది. ఈ ప్రమాదంలో పెళ్లకూరు మండలం, పెన్నేపల్లికి చెందిన తొప్పాని అంకయ్య (56) మృతి చెందాడు. అతను నాయుడుపేట మునిసిపాలిటీ, ఎల్ ఏ సాగరంలో భార్య పిల్లలతో కాపురం ఉంటూ కూలి పనికి వెళుతూ ఉండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో బొగ్గులోడుతో నాయుడుపేట పట్టణంలోకి వస్తున్న లారీ వెనక నుండి ఢీకొనింది. ప్రమాదానికి కారణమైన లారీ నాయుడుపేటకు చెందిన ఎర్రప్పశెట్టి కృష్ణయ్యనాయుడు సంబంధించిందని స్థానికులు తెలియజేశారు. ప్రమాదం జరిగి వెంటనే ప్రాణాపాయ స్థితిలో ఉన్న అంకయ్యను స్థానికులు హుటాహుటిన నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఆయనకు వైద్య సేవలు అందించారు. ఆయన పరిస్థితి విషమించడంతో ఆయన్ని తిరుపతి ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలో, ఆయన మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాయుడుపేట పట్టణ సీఐ బాబి తెలియజేశారు.

బీసీ కుల గణన చేపట్టాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దేశంలో బీసీ కుల గణను త్వరిత గతిన చేపట్టాలని తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగ రాజ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరులోని జ్యోతి రావు పూలే దంపతుల విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 25వ తేదిన తిరుపతి, ఇందిరా మైదానంలో బహిరంగ సభనిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు బీసీ నియోజక వర్గ అధ్యక్షులు తల్లం ప్రసాద్, జిల్లా కార్యదర్శి వడ్ల జగదీష్, జిల్లా ఉపాధ్యక్షులు మధు ఆచారి, జిల్లా గౌడ సంఘం నాయకులు పరుచూరు రమణయ్య గౌడ్, బిఎస్పీ సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, షరీఫ్, అల్లి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఎవరి మెప్పుకోసమో పనిచేస్తున్నారు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులు ప్రజల కోసం కాకుండా, ఎవరో మెప్పుకోసంమో పనిచేస్తున్నారని వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విమర్శించారు. తుమ్మలగుంట, ఆయన నివాసం వద్ద శుక్రవారం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గురువారం జరిగిన తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికలలో అధికార పార్టీ పోలీసులను అడ్డుపెట్టుకొని అనేక అరాచకాలుకు పాల్పడిందన్నారు. జై జగన్ అన్నందుకు పోలీసులు తనతో పాటు కొంతమంది వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో దాయునేటి కేశువులు, ఓబుల్ రెడ్డి, నంగా నరేష్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, కోటేశ్వరరావు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ :క్రీడాకారులకు శాప్ అన్నివిధాలుగా అండగా ఉంటుందని, క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రఖ్యాతిని పెంచాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని మల్టీపర్పస్ హాలులో జరుగుతున్న రైఫిల్ షూటింగ్ రేంజ్ పనులను ఆయన పరిశీలించారు. తిరుపతికి చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ డీఎస్ఏ కార్యాలయంలో శాప్ ఛైర్మన్‌ను కలిసి 61వ నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డీఎస్డీఓ సయ్యద్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ 31 లోపు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -కోట : రేషన్ కార్డు లబ్ధిదారులకు ఈ కేవైసీ ప్రక్రియను ఈ నెల 31 తేదీలోపు పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ జిల్లా అధికారులను ఆదేశించినట్లు కోట తహసీల్దార్ కటారి జయ జయ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాల కలెక్టర్లు పౌరసరఫరాల అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు.

మహారాజశ్రీ ఘనమైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు గూడూరు
O.S.NO. 284 / 2019

నందిమండలం అబ్బిరాజు ...వాది

ఎదిరి

1. మేరిగ నందకుమార్ (Died)
2. మేరిగ నారాయణమ్మ
3. మేరిగ ప్రియాంక
4. మేరిగ మౌనిక
5. మేరిగ తేజ ...ప్రతివాదులు

పై నెంబరు దావాలోని 2 నుండి 5 ప్రతివాదులకు పై నెంబరు దావాలో తే.15-4-2025 వ దినమునకు దావా సమ్మన్లు / నోటీసులు ఘనమైన కోర్టు వారు ఆదేశాలు జారీ చేసియున్నారు. కావున పై తెల్పిన 2 నుండి 5వ ప్రతివాదులకు సదరు విషయమై అనగా మిమ్మల్ని ప్రతివాదులుగా చేర్చిన విషయాన్ని ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు పై కోర్టులో పై నెంబరు దావాలో తే.15-4-2025 దీన ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గాని తెలుపుకోవలసినదిగా తెలియజేయడమైనది. అట్లు కాని యెడల పై నెంబరు దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ నోటీసు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు,
ఎ. విజయభాస్కర్, బి.ఎ, బి.ఎల్.,
వాదితరపున న్యాయవాది.

ఎస్వీయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో పలు నిర్ణయాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకి ప్రారంభం కాగా, అంతకు మునపు ఉదయం 11 గంటలకు ఆర్థిక కమిటీ సమావేశం జరిగింది. ఆర్థిక కమిటీ సమావేశంలో 2025 - 26 ఆర్థిక సంవత్సరం నకు చెందిన సాధారణ బడ్జెట్‌కు సంబంధించిన జీతభత్యాలు పెన్షన్లకు సంబంధించి 226 కోట్ల రూపాయలు అనుమతులు తీసుకున్నది. వర్సిటీ లో ప్రతిష్టాత్మక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం రూసా కు చెందిన 100 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలలో రెండవ స్టేజ్ నిధుల కేటాయింపు కు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. అదేవిధంగా వర్సిటీలో ఫార్మసీ కళాశాలలో నిర్మాణం, కొన్ని అత్యవసర ఇంజనీరింగ్ పనులకు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. పరీక్ష పేపర్ల మూల్యాంకనం రెమ్యూనరేషన్ పెంపుపై అనుమతులు మంజూరైనవి. ఆర్థిక కమిటీ సమావేశం అనంతరం కమిటీలు తీసుకున్న నిర్ణయాలను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నందు ఆమోదం పొందడం జరిగింది. ఇందులో అదనంగా కళాశాలలకు సాధారణంగా మంజూరు చేసే అఫిలియేషన్ లకు ఆమోదం తెలపడం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిల్ కార్యదర్శి రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, సభ్యులు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి తరపున ప్రభుత్వ కళాశాల డైరెక్టర్ భరత్ గుప్తా, ఆప్సీ చైర్మన్ ఆచార్య మధు మూర్తి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి అల్లాడ గౌతమ్, ఆచార్య జి పద్మనాభం రెడ్డి, సుగుణ రెడ్డి, సీకామ్ సురేంద్రనాథ్ రెడ్డి, ఆచార్య కే సుమకిరణ్, డా. కే మంజుల, డా, మొహిద్దిన్ భాష, డా. సంధ్యారాణి, నారాయణబాబు, జ్యోతి, పాల్గొన్నారు.

మా భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారు: సురేఖ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మా కుటుంబానికి పిత్రార్జితంగా సంక్రమించిన భూమికి సంబంధించిన ధ్రువపత్రాలను కుట్ర పూరితంగా తన భర్త విజయ శేఖర్ మేనత్త అయిన సుభాషిణి ఆమె కుమారులు శ్రీహరి, ఫణీంద్రతో కలిసి మా ఇంటి నుండి కాజేసి తిరుపతిలో ఉన్న బాలాజీ హాస్పిటల్ నిర్వాహకులకు చేర్చి భూమిని కాజేయాలని ప్రయత్నం చేస్తున్నారని బిఎన్ కండ్రిగ మండలం, గాజులపెళ్లూరు గ్రామానికి చెందిన వివాహిత సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

తప్పుడు రిజిస్ట్రేషన్‌తో భూమి కాజేశారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): 40 ఏళ్లుగా మాకు సంక్రమించిన భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని, భూమికి సంబంధించి అన్ని హక్కులు, రికార్డులు తమపై ఉన్నా బత్తల లక్ష్మయ్య అనే వ్యక్తి 2019లో అధికారులకు డబ్బులు ఇచ్చి ఆన్లైన్లో తమ భూమిపై తన పేరును ఎక్కించుకుని తప్పుడు రిజిస్ట్రేషన్‌తో భూమి కాజేసాడని బిఎన్ కండ్రిగ మండలం, నీర్పాకోట గ్రామానికి చెందిన సజ్జారావు వెంకట రమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు.

ర్యాలీని విజయవంతం చేద్దాం: జయరాం యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ ఏప్రిల్ 2న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకార చేస్తారని, 4వ తేదీ తిరుపతిలో పూలే విగ్రహం నుండి కచ్చప్పి ఆడిటోరియం వరకు భారీ ర్యాలీని నిర్వహించి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు కట్టా జయరాం యాదవ్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో అశోక్ సామ్రాట్ యాదవ్, హేమంత్ యాదవ్, మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, భరణి యాదవ్, వెంకటాద్రి యాదవ్, రవిశంకర్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరు మహిళా చట్టాలపై అవగా హన కలిగి ఉండాలని జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు అరవ పార్వతయ్య పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని డి.ఆర్.7 డబ్ల్యూ మహిళా కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సునిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోటేశ్వర రావు, మహబూబ్ బాషా, కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతు రావులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ముస్లింలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆర్సీ రోడ్డులోనిషాది మహల్‌లో సాయంత్ర ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందు జరిగింది. అల్లా ఆశీస్సులు ముస్లీంలతో పాటు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్ కే బాబు, నరసింహ ఆచ్చారి, అన్నా అనితా యాదవ్, వరికుంట్ల నారాయణ, మహబూబ్ బాషా, నసీరుద్దీన్ , అర్షద్ , నిజాం, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, నైనార్ శ్రీనివాసులు, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, జీవకోన సుధా, కే ఎంకే లోకేష్, ఊస మాధవరావు, రాజేష్ యాదవ్, సంతాదేవి, శిరీష, రాధా తదితరులు పాల్గొన్నారు.

రోగులకు తాగునీరు, ఉచిత భోజనం

ప్రజాశక్తి రామచంద్రపురం(చంద్రగిరి) చంద్రగిరి మండలం, నారావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు శుద్ధ మైన తాగునీరు, ఉచిత భోజనం పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు ఉచిత భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా ఆసుపత్రిలో చేరిన రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

శాబ్దబోధ మీమాంస కార్యశాల సమాపనోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం తిరుపతిలో 22వ తారీకు నుండి ప్రారంభించిన టువంటి శాబ్ద బోధ మీమాంస అనే విషయం పైన జరుగుతున్న కారేశాల యొక్క క్షమాపణ సమారోహం శుక్రవారం విశ్వవిద్యాలయంలోని శ్రీరామారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రీయ సంస్కృతి సంస్థ భూతపూర్వ కులపతి ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి విచ్చేసి శారద బోధి మీమాంసం ఔన్నత్యాన్ని వివరించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతి విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారు శారదబోతు యొక్క గొప్పతనాన్ని తెలుసుకొని దాని యొక్క క్రియాన్వయనాన్ని వారి దైనందిన జీవితంలో ఉత్తమ భాష ప్రయోగంలో ఉపయోగించాలని తెలిపారు. విశిష్టాద్వైత వేదాంత విభాగాధ్యక్షులు ప్రొ.కె.ఈ దేవనాదన మాట్లాడుతూ శాబ్ద బోధ ద్వారా ప్రతి పదము యొక్క అర్థాన్ని సస్పష్టంగా నిర్వచించగలే సామర్థ్యం వస్తుందని తెలిపారు. దర్శన డీన్ ప్రొ.వి.విష్ణు భట్టాచార్యులు మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ దర్శన ద్వారా ఈ శాబ్దబోధ మీమాంస కార్యశాలను దిగ్విజయంగా నిర్వహించడం అత్యంత హర్షణీయమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంయోజకులుగా సాహిత్య విభాగ వరిష్టాచార్యులు ప్రొ.సి.రంగనాథన్, అడిషనల్ కోఆర్డినేటర్గా న్యాయ విభాగ సహాచార్యులు డా.ఓ.పి.జి కళ్యాణ్ శాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మ్యూజియంలను అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి రామచంద్రపురం(చంద్రగిరి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చంద్రగిరి, అమరావతి, నాగార్జునకొండ మ్యూజియంలను, మహా చైత్యంలను అభివృద్ధికి అదనపు నిధులను మంజూరు చేయవలసిందిగా అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు భారత ప్రభుత్వ కేంద్ర పురావస్తు శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ లూర్దు స్వామిని కోరారు. డిల్లీ లోని తిలకుమార్గ్ లో గల కేంద్ర ప్రభుత్వ భారత పురావస్తు శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ లూర్దు స్వామితో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లోని చంద్రగిరి,అమరావతి, నాగార్జున కొండ మ్యూజియంల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ పర్యాటకులు వస్తున్నారని, ఏ ఒక్క మ్యూజియంలో కూడా గైడ్ సదుపాయం లేదని,డిస్ప్లే బోర్డులు,లైటింగ్ గ్యాలరీలను అభివృద్ధి చేయాలన్నారు. స్పందించిన జాయింట్ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ చంద్రగిరి,అమరావతి నాగార్జున కొండ మ్యూజియంల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తప్పకుండా అమరావతి సర్కిల్ నుంచి నివేదికను తెప్పించుకొని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వేద విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో స్విమ్స్ వారి పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఈరోజు జరిగినది ఈ కార్యక్రమాని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భాస్కరుడు ప్రారంభించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విసి ఆచార్య రాణీసదాశివ మూర్తి ప్రోత్సాహంతో ఈ రక్తదాన కార్యక్రమాన్ని చేస్తున్నామని వేదవిద్యార్థులంటే కేవలం వేదాభ్యాసం మాత్రమే కాదు సమాజానికి అవసరమయ్యే అన్ని సామాజిక అంశాలలో ముందుఉంటారని తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులకు పండ్లు, జ్యూస్ పంచారు. ఈ శిబిరంలో వేద, ఆగమ, పౌరోహిత్య,వేదభాష్య విభాగాలకు చెందిన 60 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్‌కు చెందిన బ్లడ్ బ్యాంక్ టీం డాక్టర్ ప్రవీణ్, విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.కే .హెచ్ .రాజేష్ కుమార్, పీవోలు డా. భరతశేఖరాచార్యులు, డా.పి, నీలకంఠం పిఆర్వో డా.టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 73వ కళాశాల వార్షికోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డా.టి నారాయణమ్మ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానముల (పూర్వ విద్యార్థి) బోర్డు మెంబర్, ఎడ్యుకేషనల్ కమిటీ మెంబర్ జి.భానుప్రకాష్ రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్చార్జ్ డా. బి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ డా, జి భద్రమణి, విశ్రాంత ప్రిన్సిపల్స్ సి. స్వరాజ్యలక్ష్మి, డా. కె మహదేవమ్మ, డా. డి ఎం. ప్రేమావతి, డా. మీనా కుమారి, వార్డెన్ హేమలత, డిప్యూటీ వార్డెన్లు సాయికుమారి, డా. లక్ష్మి, డా. వై సునీత, డా. వసుధ, డా. వై శిరీష, డా. కస్తూరి, డా. శోభ, డా. విజయకుమారి, డా. శ్రీలత, డా. ప్రవీణ, డా. పద్మిని, డా. వరప్రసూన, సుహాసిని, డా. ఏ శిరీష, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం :టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ను ఘనంగా నిర్వహిద్దామని మం డల టీడీపీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి పార్టీ నాయకులకు, కార్య కర్తల కు, అభిమానులకు పిలుపునిచ్చా రు. ఆర్‌సిపురం మండలం, నెన్నూరులో శనివారం వేడుకలు నిర్వహించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఐతేపల్లి సింగిల్ విండో మహాజన సభ

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి) చంద్రగిరి మండలం, ఐతేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయంలో నేడు మహాజన సభ నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి సభ్యులు అందరూ హాజరు కావాలని డిసిసి బ్యాంకు మేనేజర్ సంకీర్తనశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త పడాలి

ప్రజాశక్తి రామచంద్రపురం (చంద్రగిరి) వేసవిలో ఎండలు ముంచుకు వస్తున్నాయని వడదెబ్బ పాడిన పడకుండా జాగ్రత్త పడాలని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటి డెమో కిరణ్ కుమార్ అన్నారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్ ఆదేశాల మేరకు చంద్రగిరి మండలం కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వడ దెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఇఓ ఈశ్వరయ్య,ఆశా కార్యకర్త గౌరి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాపులకు అవకాశం కల్పించండి

సీఎం చంద్రబాబుకు టీడీపీ నాయకుడు ఆటో బాలాజీ వినతి

ప్రజాశక్తి-నాగలాపురం: నాగలాపురం మండలంలో ఇంతవరకు కాపు(బలిజ)కులస్తులకు సంబంధించి నామినేటెడ్ పదవులకు చైర్మన్ స్థానం కల్పించలేదని, నాగలాపురం మండల (కాపు) టిడిపి నాయకుడు ఆటో బాలాజీ ఏపీ సీఎం చంద్రబాబుకి వినతి అందించారు. శుక్రవారం సీఎం చంద్రబాబు తమిళనాడు రాష్ట్రం చెన్నై లోని గిండీ ఐఐటీ కళాశాలకు విచ్చేసి, తిరుగు ప్రయాణమవుతుండగా టీడీపీ నాయకుడు ఆటో బాలాజీ కలిశారు. నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల గురించి వివరించారు. నాగలాపురం మండలం, సురుటుపల్లె పళ్ళికొండేశ్వరాలయం, నాగలాపురం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవులకు సంభందించి ఇంతవరకు కాపు కులస్తులకు అవకాశం కల్పించలేదని వాపోయారు. సంభందించిన నివేదికను సీఎంకు అందించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి నామినేటెడ్ పదవుల్లో కాపులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - నాగలాపురం: రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం నాగలాపురం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, వాటి అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది సమావేశమై ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలపై ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై చర్చించారు. అనంతరం రైతులకు వ్యవసాయ పనిముట్లు ఎమ్మెల్యే చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.